సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



పగలు రెక్కీ.. రాత్రి చోరీ

కడప నగరంలో పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. -8లో



హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ప్రొద్దుటూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెన ర్జీపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2/22.2

జిల్లాలో శనివారం 22.2 - 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం



ఏపీ రెడ్డి సంఘం జిల్లా కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: ఏపీ రెడ్డి సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఎల్వీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అమర్‌నాథరెడ్డి, గంగా సతీష్‌రెడ్డి, రమణారెడ్డి, కార్యదర్శులుగా బి.వెంకట శివారెడ్డి, శివరామిరెడ్డి, సుధా అంకిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శివశంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి తదితరులను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. కాగా, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 14 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం జనవరి 7న అనంతపురంలో నిర్వహిస్తున్నామని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

రేషన్ పంపిణీ తనిఖీ

వల్లూరు: మండల పరిధిలోని గోటూరు గ్రామంలో జరుగుతున్న రేషన్ పంపిణీని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనంతో చేస్తున్న పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో రేషన్ సక్రమంగా అందుతోందా, ఏమైనా సమస్యలు వున్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్ రావు, ఆర్ఐ ప్రశాంత్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రాలను సందర్శించిన సచివాలయ ఉద్యోగులు



పుష్పగిరిలో సెక్రటేరియట్ మహిళా ఉద్యోగులు

ఒంటిమిట్ట/వల్లూరు: ప్రముఖ క్షేత్రాలైన ఒంటిమిట్ట, పుష్పగిరిలను ఏపీ సెక్రటేరియట్ వెల్ఫేర్ మహిళా అధికారులు, ఉద్యోగుల బృందం శనివారం సందర్శించింది. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని శ్రీ సీతారామలక్ష్మణులను వారు దర్శించుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి, సంతాన మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

భవితకు భరోసా

- దివ్యాంగుల సేవలో భవిత కేంద్రాలు
- ఇక డిజిటల్ బోధన
- ట్యాబ్‌ల అందజేత
- 18 యాప్‌ల ద్వారా శిక్షణ
- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



ట్యాబ్‌లతో విద్యార్థులు, ఐఈఆర్పీలు

కడప ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభావంతుల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపి.. వారి కలలను సాకారం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటిపిల్లలతో సమానంగా చదువుకోలేక.. తల్లడిల్లే వారి బంగారు భవిష్యత్తు కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి బోధన అందిస్తోంది. వారికి అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేసి ఆదరిస్తోంది. ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారికి అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

గతంలో అధ్వానంగా..

భవిత కేంద్రాల నిర్వహణ గతంలో చాలా అధ్వానంగా ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని రకాల వసతులతో విరాజిల్లుతున్నాయి. జిల్లాలోని 36 మండలాల పరిధిలో 36 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 689 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సేవలు పొందుతున్నారు. వీరికి మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాల పథకాలు అమలు చేస్తోంది. ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ మిషన్లు, ట్రై సైకిళ్లు, మధ్యాహ్న భోజనంతోపాటు బస్‌పాసులు, వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, ప్రతి నెల స్టైఫండ్, హెచ్‌బీసీ, ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్ అలవెన్సులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది.

ప్లే స్కూల్ తరహాలో..

చదువుతోపాటు ఆటలు, పాటల్లో ప్లే స్కూల్ తరహాలో.. అన్ని రకాలుగా అభివృద్ధి చెందేలా శిక్షణ ఇస్తున్నారు. స్పెషల్ బీఈడీ చేసిన ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తుంటారు. వినికిడి లోపం ఉన్న వాళ్లకు వీడియో చూపించి అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ఇలా ప్రతి అంశంలోనూ ఉపాధ్యాయులు చక్కటి శిక్షణ ఇచ్చి లోపాలు మర్చిపోయేలా చేస్తున్నారు.

ఫిజియోథెరపీ

ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. శారీరక వైకల్యం, పక్షపాతం, గ్రహణమొర్రి, గ్రహణశూల వంటి వాటితో బాధ పడుతున్న వారికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆపరేషన్లు చేస్తున్నారు.

తాజాగా ట్యాబ్‌లు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా దృష్టి, వినికిడి లోపం ఉన్న వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో.. ఆధునిక సాంకేతికతతో కూడిన 171 ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఇందులో ఐఈఆర్పీలకు 72, ఐఈడీఎస్ఎస్‌లకు 35, దృష్టిలోపం ఉన్న వారికి 13, వినికిడిలోపం ఉన్న వారికి 51 ఇలా మొత్తంగా 171 ట్యాబ్‌లను అందజేసింది. ట్యాబ్‌లను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై ఉపాధ్యాయులు, పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నారు.

వెలుగులు నింపేలా సమాచారం

6 నుంచి 10వ తరగతి చదువుతున్న దృష్టి, వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు అనుగుణంగా ట్యాబ్‌లలో అత్యంత అధునాతన సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. వీటిలో గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, బీమై ఐ, ఎన్ విజన్ ఆల్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు పొందుపరిచారు. అంధులు, బధిరులకు వీలుగా ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించేలా, శబ్ద సాంకేతికతల ద్వారా వినియోగించేలా, దృష్టిలోపం వున్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితరాలతో ప్రత్యేకంగా రూపొందించిన 18 యాప్‌లను ట్యాబ్‌లలో పొందుపరిచారు.

పలకరిస్తే స్పందిస్తున్నాడు



మా బాబు అహ్మద్‌కు 9 ఏళ్లు. సెలబ్రిల్ పాల్సీచే బాధపడుతున్నాడు. ఎప్పుడూ మంచంపైనే పడుకునే వాడు. మా ఊర్లో ఉండే భవితా కేంద్రానికి 3 ఏళ్ల నుంచి పంపుతున్నాను. ప్రస్తుతం ఎవరి సహకారం లేకుండా కూర్చొంటున్నాడు. పలకరిస్తే స్పందిస్తున్నాడు.
- ఖదీరున్నిసా, అహ్మద్ తల్లి, వేంపల్లె

తన పనులు చేసుకోగలుగుతోంది



మా పాప పేరు శీలంబేబీ. 9 ఏళ్లుగా బుద్ధిమాద్యంతో బాధపడుతోంది. సరిగా కూర్చొనేది కూడా కాదు. భవిత కేంద్రంలో చేర్చాము. ప్రస్తుతం తన చిన్న చిన్న పనులను చేసుకోగలుగుతుంది. పాపకు వీల్ చైర్ వచ్చింది.
- శీలంబేబితో తల్లి లత, వేంపల్లె

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం



ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కూడా డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగానే ఇటీవల పిల్లలకు, ఐఈఆర్పీలు, ఐఈడీఎస్ఎస్‌లకు ట్యాబ్‌లను పంపిణీ చేశాం. త్వరలో దీనిపై వారికి శిక్షణ నిర్వహించనున్నాం.
- మిట్టా కేశవరెడ్డి, జిల్లా సహిత విద్య సమన్వయకర్త

ప్రభుత్వం చేయూత



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోంది. వారిని సాధారణ విద్యార్థులకు సమానంగా తీర్చిదిద్దేలా భవితా కేంద్రాల ద్వారా కృషి చేస్తోంది.
- అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

జిల్లాలో భవిత కేంద్రాల వివరాలు

కేంద్రాల సంఖ్య	36
విద్యార్థులు	689
ఐఈఆర్పీలు	72
ఐఈడీఎస్ఎస్‌లు	35
ఫిజియోథెరపిస్టులు	17
ఆయాలు	36





వేంపల్లె భవిత కేంద్రం

అలవెన్సు పొందే వారి సంఖ్య

ఎస్కార్ట్	503
ట్రాన్స్‌పోర్టు	670
స్టైఫండ్	1192
హెచ్‌బీసీ	237
మొత్తం	2602

2022-23 చెల్లించిన అలవెన్స్ : రూ.66.14 లక్షలు

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: 'మిచాంగ్' తుపాను జిల్లాలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నందున.. ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. బలమైన ఈదురు గాలులు, భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. నదులు, వంకల పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉండవచ్చన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఇసుక సంచులు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు వారికి సంబంధించిన పంటలు, ధాన్యం, పశు సంపదను సురక్షితంగా కాపాడుకునే చర్యలు చేపట్టాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే కంట్రోల్ రూము నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓ కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జిల్లాలోని కంట్రోల్ రూములు

- కలెక్టరేట్ : 08562-246344
- ఆర్డీఓ ఆఫీసు, కడప: 08562-295990
- ఆర్డీఓ ఆఫీసు, జమ్మలమడుగు: 9502836762
- ఆర్డీఓ ఆఫీసు, బద్వేలు: 76708 82856
- ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల: 62810 04720

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–విశాఖపట్టణం–కడపల మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4 నుంచి 6 వరకు రద్దు చేశారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తుపాను ప్రభావంతో రద్దు చేశారని వారు పేర్కొన్నారు.

కొలువుల మేళా.. ఆనందహేల

రాయచోటిలో మెగా జాబ్‌మేళా

రాయచోటి: రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 120 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు 6 వేల మంది ఉద్యోగ, ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మెగా జాబ్‌మేళాను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, కలెక్టర్ గిరీషాతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఉద్యోగాలకు ఎంపికైన 1880 మందికి వారు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కొలువు దక్కిన వారు సంతోషం వ్యక్తం చేశారు. జాబ్‌మేళాకు అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి నిరుద్యోగ యువత వచ్చారు. వారికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం.చిదంబర్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకటేశ్వరరెడ్డి, మాసన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే, కలెక్టర్, జెడ్పీ చైర్మన్

నేడు డిపార్ట్‌మెంటల్ పరీక్షల బుక్‌లెట్స్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఎన్‌జీవో భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు డిపార్ట్‌మెంటల్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్స్ విడుదల చేయనున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు సీవీ ప్రసాద్, చంగలరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు హాజరవుతారని వారు పేర్కొన్నారు. 300 పేజీల బిట్స్ బుక్‌లెట్స్, మోడల్ పేపర్లు, ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసే విధానంపై కర దీపిక అందుబాటులో ఉంటాయని వివరించారు. అన్ని శాఖల ఉద్యోగులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

93.07 శాతం పింఛన్ల పంపిణీ

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. మొత్తం 2,63,502 మందికి గాను రెండవ రోజైన శనివారం సాయంత్రానికి 2,45,249 మందికి అందజేశారు. దీంతో 93.07 శాతంగా నమోదైంది.



భక్తులతో కిటకిటలాడుతున్న కలసపాడు చర్చి

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

కలసపాడు: కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిశుద్ధ పరిపేతురు పరిపౌలు చర్చి 136వ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి చర్చి ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. బ్రిటిష్ హయాంలో నిర్మించిన చర్చి వేడుకలను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వారు చర్చి లోపల క్రీస్తు శిలువకు మొక్కులు చెల్లించుకున్నారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్‌ను కలసపాడు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మేళతాళాలతో చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. చర్చి డీనరీ చైర్మన్ సంజయ్‌మధు, ఆశిస్‌గాబ్రియేల్, బేబీసరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్‌లు బిషప్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మ సూక్తులను ప్రసంగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్చి కమిటీ వారు అన్ని వసతులు కల్పించారు. పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, కలసపాడు ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బిషప్ ఐజాక్‌వరప్రసాద్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 16వ తేదీన వైఎస్సార్ కడపలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: విద్యార్థులకు గ్రూప్-1, గూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1, గ్రూప్–2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 81791 00598 ఫోన్ నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 16, 2023 (శనివారం)

వేదిక
హరిత హోటల్, ఎస్పీ బంగ్లా ఎదురుగా, కోటిరెడ్డి సర్కిల్, కడప

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8179100598

ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన అవసరం

– శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దీని ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని శాశ్వత లోక్ అదాలత్ చైర్మెన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో శాశ్వత లోక్ అదాలత్ న్యాయ సేవలపై ప్రిన్సిపాల్, లెక్చరర్లతోపాటు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానం అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. లేదా 8639684279. 9963731698 నంబర్లకు ఫోన్‌చేసి చట్టంపై సరైన అవగాహన పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులతోపాటు శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

- 35 రోజులుగా తప్పించుకొని తిరుగుతూ..
- ఎట్టకేలకు పోలీసులకు దొరికిన టీడీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీపై హత్యాయత్నం కేసులో నిందితులు
- రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- అరెస్ట్ వివరాలను వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉండి 35 రోజుల నుంచి పోలీసులకు ముప్పుతిప్పలు పెడుతూ తప్పించుకొని తిరుగుతున్న భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరులోని కొర్రపాడు రోడ్డులో ఉన్న మల్లేలమ్మ గుడి వద్ద అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడించారు. అక్టోబర్ 28న వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీని చంపాలనే ఉద్దేశంతో ఈ దాడి జరిగింది. బెనర్జీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. అలాగే భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించేవారు. గతంలో టీడీపీకి చెందిన నందం సుబ్బయ్య హత్య కేసులో బెనర్జీ ముద్దాయిగా ఉన్నాడు. అప్పటి నుంచి వీరి మధ్య వ్యక్తిగతంగా, పార్టీ పరంగా విరోధం ఉండేది. తరచూ వాగ్వాదం, తగవులు కొనసాగుతూ వీరి మధ్య ఉన్న మనస్పర్థలు తారాస్థాయికి చేరాయి. ఈ విషయాలన్నీ భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెప్పేవారు. సరైన అవకాశం కోసం వేచి ఉన్న ముగ్గురు బెనర్జీని మట్టు పెట్టేందుకు వ్యూహ రచన చేశారు. అక్టోబర్ 28న వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర పేరుతో ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టారు. ఆ రోజు బెనర్జీ పార్టీ కార్యక్రమంలో బిజీగా ఉంటాడని.. అతన్ని మట్టు పెట్టేందుకు ఇదే సరైన సమయమని వారు పథకం రచించారు. ఈ క్రమంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బైక్‌లో వెళ్తున్న బెనర్జీని భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు తమ బైక్‌తో ఢీ కొట్టారు. అక్కడ వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పక్కనే టెంకాయల బండిపై ఉన్న కత్తితో బెనర్జీని నడిరోడ్డులో విచక్షణారహితంగా నరికారు. పోలీసులు రావడంతో సంఘటనా స్థలం నుంచి నిందితులిద్దరూ పారిపోయారు. అప్పటి నుంచి వారు పోలీసులకు దొరక కుండా పరారీలో ఉన్నారు. ఈ క్రమంలో భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలను కొర్రపాడు రోడ్డులోని మల్లేలమ్మ గుడి వద్ద త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు మోటార్ బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

సహకరించిన వారి పాత్రపై విచారణ

హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న నిందితులిద్దరికీ సహకారాలు అందించిన వారిని కూడా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, కొత్త సిమ్ కార్డుల ద్వారా భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు స్థానికంగా ఏం జరుగుతుందనే సమాచారాన్ని తెలుసుకునేవారు. పరారీలో ఉన్న నిందితులకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాయచోటికి చెందిన సిద్ధారెడ్డితో పాటు ఇంకా కొంత మంది ఆర్థిక సాయంతో వాహనాలను సమకూర్చారన్నారు. వాళ్లు ఉండేందుకు వసతి ఏర్పాట్లు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నేరం చేసిన ముద్దాయిలకు సహకరించడం కూడా నేరం అవుతుందన్నారు, ఈ విషయం తెలిసి కూడా నిందితులకు వీరు సహకారం అందించినట్లు తమ విచారణలో నిర్ధారణ అయిందని చెప్పారు. విచారణ అనంతరం సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు. కాగా ఈ కేసులో టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నవంబర్ 13న త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కడప సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన 21న బెయిల్‌పై విడుదలయ్యారు.

నిందితుల కోసం 35 రోజులు శ్రమించిన పోలీసులు

బెనర్జీపై హత్యాయత్నం చేసిన కేసులో పరారీలో ఉన్న భరత్‌కుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిల కోసం పోలీసులు 35 రోజుల పాటు శ్రమించారు. ఏపీతో పాటు తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల్లో నిందితులిద్దరూ తలదాచుకుంటూ వచ్చారు. వీళ్లు బస చేసిన ప్రాంతాల్లో కూడా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులోని నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన త్రీ టౌన్ సీఐ వెంకటరమణ, ఇతర సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. రివార్డు కోసం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు.

నవశకం

మూడు సార్లు అమ్మఒడి అందుకున్నా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన విద్యారంగ సంస్కరణలు అందరి మన్ననలు పొందుతున్నాయి. నా ఇద్దరు కుమార్తెలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇప్పటి వరకు మూడు సార్లు అమ్మఒడి పథకం ద్వారా నగదు అందుకున్నాను. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సమగ్రాభివృద్ధి చెందాయి.

– డి.సునీత, విద్యార్థిని తల్లి, హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, ప్రొద్దుటూరు

గూడులేని మాకు నీడనిచ్చి ఆదుకున్నారు



నా భర్త పేరు షామీర్. అరటికాయలు లోడుకు కూలి పనులకు వెళతారు. మాకు ఇద్దరు చిన్నపిల్లలు. నా భర్త కూలి పనులు చేసుకుని వచ్చే కూలి డబ్బులే మాకు జీవనాధారం. ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్న మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీడనిచ్చి ఆదుకున్నారు. గత ప్రభుత్వంలో స్థలం ఇవ్వాలని ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న మాకు స్థలం ఇచ్చి పక్కాగృహం మంజూరు చేసి గూడు కల్పించారు. మాలాంటి పేదలకు ఇళ్లు ఇచ్చి జగన్‌మోహన్‌రెడ్డి దేవుడయ్యారు.

– రేష్మా, వేముల మండలం

గండికోట వెనుక జలాల్లో మహిళ ఆత్మహత్య



శింగనమల లక్ష్మీకాంతమ్మ (ఫైల్)

కొండాపురం : ప్రొద్దుటూరు మండలం ఖాదరాబాద్ గ్రామానికి చెందిన శింగనమల లక్ష్మీకాంతమ్మ (52) గండికోట వెనుక జలాల్లో ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ యోగేంద్ర కథనం మేరకు.. ఖాదరాబాద్ గ్రామంలోని ఏడో వార్డులో నివాసం ఉంటున్న శింగనమల లక్ష్మీకాంతమ్మ గత నెల 30 తేదీన ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు , ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేయకపోవడం, దుబారాగా డబ్బులు ఖర్చు చేయడం, చెప్పిన మాట వినకపోవడంతో ఆమె మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె భర్త నాగసుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- రూ. 10.50 లక్షలు విలువజేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- మీడియాతో కడప డీఎస్పీ షరీఫ్



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని కడప డీఎస్పీ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. శనివారం కడప నగరంలోని చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. కడప శంకరాపురానికి చెందిన కృష్ణకుమార్ గత కొంతకాలంగా నగరంలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని పగలు రెక్కీ నిర్వహిస్తూ రాత్రి సమయాల్లో ఆయా ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవాడన్నారు. ఈ విషయంగా తమకు అందిన ఫిర్యాదుల మేరకు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐలు రవికుమార్, తులసి నాగప్రసాద్‌లు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో నిందితుడిని చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి తొమ్మిది లక్షలు విలువజేసే సుమారు 125 గ్రాముల బంగారు వస్తువులు, లక్షా 50 వేలు విలువజేసే 1.7 కిలోల వెండి వస్తువులు, దొంగతనాలకు ఉపయోగించిన హైడ్రాలిక్ కట్టర్, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇళ్లకు తాళాలు వేసేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. దొంగను అరెస్టు చేయడంలో కృషి చేసిన చిన్నచౌకు పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రశంసిస్తూ రివార్డు కోసం సిఫార్సు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐ నరసింహా రెడ్డి, ఎస్‌ఐలు తులసి నాగ ప్రసాద్, రవికుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఏఎస్ ప్రసాద్, ఎంవీ సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుళ్లు ఎన్.వేణుగోపాల్, జె.రామసుబ్బారెడ్డి, సి.శివకుమార్, కానిస్టేబుళ్లు పీవీ శ్రీనివాసులు, పి.ఖాదర్‌హుసేన్, సి.సుధాకర్‌యాదవ్, ఎస్పీ రంతుబాషా, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లాల్సి వచ్చినప్పుడు సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు. ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు వారివారి వీధుల్లో కమిటీలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే ఆ సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూముకు తెలియజేయాలన్నారు. అలాగే 91211 00531, 91211 00542, 81868 81100, డయల్ 100కు కూడా సమాచారం ఇవ్వవచ్చని ఆయన వివరించారు. అలాగే కడప నగరంలో నాలుగు రక్షక్ వాహనాలు, 16 బ్లూ కోల్ట్సను పెంచామన్నారు. కడపను రాత్రి వేళల్లో రెండు విభాగాలుగా చేశామన్నారు. జోన్–1లో కడప టుటౌన్, తాలూకా, సీకే దిన్నె పోలీసు స్టేషన్లుగాను, జోన్–2లో కడప వన్‌టౌన్, చిన్నచౌకు, రిమ్స్ పోలీసుస్టేషన్లు ఉన్నాయన్నారు. ఒక్కొక్క జోన్‌కు ఒక సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు రాత్రివేళల్లో నిర్విరామంగా తిరుగుతూ ప్రతి గంటకు వేర్వేరుచోట్ల వాహనాలను తనిఖీ చేస్తుంటారన్నారు. వీరందరిపై కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణ ఉంటుందన్నారు.

వివాహిత అదృశ్యం

ముద్దనూరు : మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన రేణుక(19) అనే వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం తాండూరు మండలం కరెంకోట్ గ్రామానికి చెందిన ఈమె ఈ ఏడాది మే 3వ తేదీన చౌటిపల్లె గ్రామానికి చెందిన రంగారెడ్డిని వివాహం చేసుకుంది. శనివారం ఉదయం రంగారెడ్డి వ్యక్తిగత పనిమీద కొండాపురం వెళ్లాడు. ఉదయం 9 గంటల సమయంలో భార్య రేణుకకు ఫోన్ చేసి మాట్లాడాడు. తిరిగి కొద్దిసమయం అనంతరం మళ్లీ ఫోన్ చేయగా భార్య ఫోన్ స్విచ్ ఆఫ్‌గా ఉంది. దీంతో రంగారెడ్డి అతని తండ్రి రామిరెడ్డిని ఇంటికి వెళ్లి చూడమని తెలిపారు. అయితే రామిరెడ్డి ఇంటికి వెళ్లి చూడగా రేణుక ఇంటిలో లేదు. తన భార్య కనిపించడం లేదని రంగారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రూప్‌-2కు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు తిరుపతిలో గ్రూప్–2లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఈనెల 5వ తేదీలోగా జిల్లాలోని డీఎస్‌టీడబ్ల్యు, డీటీడబ్ల్యుఓ కార్యాలయాల్లో విద్యార్హత, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జతచేసి దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 81878 99877 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలి

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖలో అమలయ్యే పథకాలపై అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. శనివారం స్థానిక పాత రిమ్స్‌లోని ఆ శాఖ కార్యాలయం జోన్–4 పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న డెమో, డిప్యూటీ డెమోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 11న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్ : కళా ఉత్సవ్–2023లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో 9,10, 11,12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11వ తేదీన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి పోటీలను రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలో నిర్వహిస్తారన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారు జాతీయస్థాయి పోటీలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. జాతీయస్థాయిలో ప్రతి కేటగిరికి మొదటి బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు, తృతీయ బహుమతి 15 వేలు ఇస్తారని తెలిపారు. దీంతోపాటు కళా ఉత్సవ్‌లో జాతీయస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నూతన పార్లమెంట్ సందర్శనకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అట్లూరు : మండల పరిధిలోని కోనరాజుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గంపల చిన్నయల్లయ్య (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ కె.సి. రాజు వివరాల మేరకు చిన్నయల్లయ్య కోనరాజుపల్లి సూర్యాభవన్ పాఠశాల ప్రహరీకి ఉరి వేసుకుని శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే శనివారం ఉదయం బద్వేలు రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్‌తో కలసి అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించారు. అయితే మృతుని భార్య రమణమ్మ తన భర్త మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

జీజీఎంపీ పనులు నెలాఖరుకు పూర్తి కావాలి

– మండల ఇంజినీర్లతో పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) కార్యక్రమం కింద జిల్లాలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఈనెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు జీవీ శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. శనివారం మండల ఇంజినీర్లు, ఏఈలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జీజీఎంపీ కింద జిల్లాలో 1234 సీసీ రోడ్ల పనులను రూ. 45.84 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటికి 657 పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. కలసపాడు, పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు, రాజుపాలెం, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, కమలాపురం, వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి, తొండూరు, లింగాల, వేముల, సిద్దవటం మండలాలు సీసీ రోడ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నాయని వివరించారు. సకాలంలో పనులు పూర్తి కావడానికి ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదంటూ ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు.

అసాంఘిక చర్యలకు ప్రతినిధి బీటెక్ రవి




విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లింగాల : సులభంగా డబ్బులు సంపాదించడం కోసం పలు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తమ నాయకుడి గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందని లింగాల వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. డబ్బు సంపాదించడం కోసం బీటెక్ రవి జూదం, క్రికెట్ బెట్టింగ్, భూ తగాదాల పంచాయితీలు చేస్తున్నాడన్నారు. పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని, కాణిపాకంలో ప్రమాణం చేద్దామంటున్న ఆయన స్వగ్రామమైన కసునూరు, అంకాలమ్మ గూడూరులో ఉండే అంకాలమ్మ లేదా ఏ గుడిలోనైనా తనకు క్రికెట్ బుకీ లేదా బెట్టింగ్‌లతో సంబంధం లేదని ప్రమాణం చేయగలడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యాలయాలు పులివెందులలో కట్టుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దాదాపు 13 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు పులివెందుల ప్రాంతానికి గానీ, వైఎస్సార్ జిల్లాకు గానీ ఏమి చేశాడో చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబు సీఎం కాదు కదా పీఎం అయినా కూడా చేయలేని అభివృద్ధిని జిల్లాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్ రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో లింగాల మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ భర్త మల్లికార్జున రెడ్డి, అంబకపల్లి బాబురెడ్డి, ఎగువపల్లి గంగాధర్‌రెడ్డి, కర్ణపాపయ్యపల్లి రమేష్ రెడ్డి, బోనాల నిరంజన్ రెడ్డి, లోపట్నూతల భూషణ్ రెడ్డి, చిన్నకుడాల నాగేంద్రనాథ్‌రెడ్డి, రామాట్లపల్లి జగన్‌మోహన్ రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బండి వెంగల్ రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానవిల్ కె.రవి రచనలు.. చైతన్య దీపికలు



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

వైవీయూ : రచయితగా, కవిగా, పాటల స్వరకర్తగా, గాయకుడిగా, న్యాయవాదిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వానవిల్ కె.రవి రచనలు చైతన్య దీపికలని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అన్నారు. వైవీయూ, తమిళ్ కల్చరల్ రీసోర్స్ సెంటర్ పల్లక్కాడ్, డీఏవీ కళాశాల, అజ్మీర్ సహకారంతో నిర్వహిస్తున్న »వానవిల్ కె. రవి రచనల్లో భిన్న దృక్పథాలు« అన్న అంశంపై రెండురోజుల జాతీయ సెమినార్ ముగింపు సమావేశం శనివారం విశ్వవిద్యాలయంలోని సురభి సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 116 సదస్సులు వానవిల్ కె.రచనలపై నిర్వహించారంటే ఆయన రాసిన పుస్తకాల్లోని వస్తుగాఢత అర్థం చేసుకోవచ్చన్నారు. వానవిల్ అంటే ఇంద్రధనస్సు అని అర్థమని, రవి రచనలు సైతం అలాగే ఉంటాయన్నారు. గౌరవ అతిథి, నెల్లూరు తెలుగు క్లాసికల్ సెంటర్ డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి ప్రయోజనం కలిగించే కవితలు, రచనలు వానవిల్ రాశారన్నారు. ప్రతి కవితలో చివరన వచ్చే పదం శీర్షికగా తీసుకోవడంలో భిన్నత్వం కనిపిస్తుందన్నారు. »మాట« మీద సాధికారత కలిగిన వారు కాబట్టే లాయర్‌గా, కవిగా రవి రాణించారన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రహ్లాదుని జీవితం, దళిత యువతి కుయిలీ వంటి రచనలు నేటి యువతులకు శౌర్యాన్ని, తెగింపును ఇస్తుందన్నారు. రచయిత వానవిల్ కె.రవి మాట్లాడుతూ తన రచనలపై సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సెమినార్ సంచాలకులు ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల జాతీయ సెమినార్ విజయవంతమైందని, సదస్సు అర్థవంతంగా సాగిందన్నారు. కార్యక్రమంలో అజ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మిఅయ్యర్, డీన్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య పార్వతి, ఆచార్య ఏజీ దాము, ఆచార్య పుత్తా పద్మ, ఆచార్య పి.రమాదేవి, డాక్టర్ ఎల్. విజయకృష్ణారెడ్డి, ఆచార్య బాలసుబ్రమణ్యం, గణేష్‌మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.